పాఠం 6

# దేవుని రాజ్యమంటే ఏమిటి?

దేవుని రాజ్యం ఎక్కడ నెలకొల్పబడింది? (**1**) దాని రాజు ఎవరు? (**2**)

రాజుతోపాటు ఇతరులు పరిపాలనలో భాగం వహిస్తారా? ఆలాగైతే, ఎంతమంది? (**3**)

మనం అంత్యదినాల్లో జీవిస్తున్నామని ఏది చూపిస్తుంది? (**4**)

భవిష్యత్తులో దేవుని రాజ్యం మానవజాతి కొరకు ఏమి చేస్తుంది? (**5-7**)



1. యేసు భూమిపైనున్నప్పుడు, దేవుని రాజ్యం కొరకు ప్రార్థించుమని ఆయన తన అనుచరులకు నేర్పించాడు. రాజ్యం అంటే రాజు నడిపించే ప్రభుత్వం. దేవుని రాజ్యం ఒక ప్రత్యేకమైన ప్రభుత్వం. అది పరలోకంలో స్థాపించబడింది, అది ఈ భూమిని పరిపాలిస్తుంది. అది దేవుని నామాన్ని పరిశుద్ధపరుస్తుంది, లేక పవిత్రపరుస్తుంది. అది దేవుని చిత్తం పరలోకమందు నెరవేరుతున్నట్లుగానే భూమియందు నెరవేరేలా చేస్తుంది.—మత్తయి 6:9, 10.

2. తన రాజ్యానికి యేసు రాజవుతాడని దేవుడు వాగ్దానం చేశాడు. (లూకా 1:30-33) యేసు భూమిపైనున్నప్పుడు, తాను దయగల, న్యాయవంతమైన, పరిపూర్ణ పరిపాలకునిగా ఉంటానని నిరూపించుకున్నాడు. ఆయన పరలోకానికి తిరిగి వెళ్లినప్పుడు, వెంటనే దేవుని రాజ్యానికి రాజుగా నియమించబడలేదు. (హెబ్రీయులు 10:12, 13) యెహోవా 1914 లో, యేసుకు తాను వాగ్దానం చేసిన అధికారాన్ని ఇచ్చాడు. అప్పటి నుండి యేసు, పరలోకంలో యెహోవా నియమిత రాజుగా పరిపాలిస్తున్నాడు.—దానియేలు 7:13, 14.

3. పరలోకానికి వెళ్లడానికి యెహోవా భూమి మీద నుండి విశ్వాసులైన కొంతమంది స్త్రీపురుషులను కూడా ఎన్నుకున్నాడు. వారు యేసుతోపాటు మానవజాతిపై రాజులుగా, న్యాయాధిపతులుగా, యాజకులుగా పరిపాలిస్తారు. (లూకా 22:28-30; ప్రకటన 5:9, 10) తన రాజ్యంలో ఉండే ఈ సహ పరిపాలకులను యేసు "చిన్న మందా" అని పిలిచాడు. వారి సంఖ్య 1,44,000.—లూకా 12:32; ప్రకటన 14:1-3.

4. .యేసు రాజైన వెంటనే, సాతానును అతని దుష్టదూతలను పరలోకంలో నుండి భూపరిధిలోకి పడద్రోశాడు. అందుకే 1914 నుండి ఇక్కడ భూమిపై పరిస్థితులు ఎంతో చెడుగా మారాయి. (ప్రకటన 12:9, 12) యుద్ధాలు, కరవులు, తెగుళ్లు, పెరుగుతున్న అవినీతి—ఇవన్నీ యేసు

పరిపాలిస్తున్నాడని, ఈ విధానాంతం దాని అంత్య దినాల్లో ఉందని తెలిపే "సూచన" లోని భాగమే. —మత్తయి 24:3, 7, 8, 12; లూకా 21:10, 11; 2 తిమోతి 3:1-5.

5. గొర్రెల కాపరి మేకల్లోనుండి గొర్రెలను వేరు పరచినట్లు, యేసు త్వరలోనే ప్రజలను వేరుపరచి వారికి తీర్పుతీరుస్తాడు. ఆయన యథార్థ ప్రజలుగా తమను తాము నిరూపించుకొనేవారు "గొర్రెలు." వారు భూమిపై నిత్యజీవం పొందుతారు. దేవుని రాజ్యాన్ని నిరాకరించిన వారు 'మేకలు.' (మత్తయి 25:31-34, 46) సమీప భవిష్యత్తులో, మేకలవంటి వారినందరినీ యేసు నాశనం చేస్తాడు. (2 థెస్సలొనీకయులు 1:6-9) మీరు యేసు 'గొర్రెలలో' ఒకరై ఉండాలని ఇష్టపడితే, మీరు రాజ్యవర్తమానాన్ని విని, నేర్చుకొనేదానికి అనుగుణంగా ప్రవర్తించాలి.—మత్తయి 24:14.

6. ఇప్పుడు భూమి అనేక దేశాలుగా విభజించబడింది. ప్రతి దానికి దాని స్వంత ప్రభుత్వం ఉంది. ఈ దేశాలు తరచూ ఒకదానితో ఒకటి పోరాడుతుంటాయి. కాని దేవుని రాజ్యం మానవ ప్రభుత్వాలన్నిటినీ తీసివేస్తుంది. అది యావత్ భూమిపైన ఏకైక ప్రభుత్వంగా పరిపాలిస్తుంది. (దానియేలు 2:44) అప్పుడిక యుద్ధం, నేరం, హింస ఎంతమాత్రం ఉండవు. ప్రజలందరూ శాంతి, ఐక్యతలతో కలిసి జీవిస్తారు.—మీకా 4:3, 4.

7. యేసు వెయ్యేండ్ల పరిపాలనా కాలంలో, నమ్మకస్థులైన మానవులు పరిపూర్ణులౌతారు, భూమంతా పరదైసుగా మారుతుంది. వెయ్యేండ్ల అంతానికి, దేవుడు తనను చేయమని అడిగిన పనులన్నీ యేసు చేస్తాడు. అప్పుడు ఆయన రాజ్యాన్ని తిరిగి తన తండ్రికి అప్పగిస్తాడు. (1 కొరింథీయులు 15:24) దేవుని రాజ్యం ఏమి చేస్తుందో మీరు మీ స్నేహితులకు, ప్రియమైనవారికి ఎందుకు చెప్పకూడదు?

---

*యేసు పరిపాలన క్రింద,*
*ద్వేషం లేక పక్షపాతం ఇక ఉండదు*

